క్లుప్తంగా

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి



సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. రంగంపేట, అంటిపేట, కాశీపేట గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయి అధికారుల పర్యవేక్షణలో గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో ఇంకుడు గుంతలు, పాఠశాలల ప్రహరీ, బీటీరోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ భాను, ఈసీ కృష్ణ, టీఏలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. సాలూరు పట్టణంలో శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో పాటు, పోక్సో, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై పట్టణ ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. శాంతిభద్రలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

- డీఐఓ నారాయణ



భామిని పీహెచ్‌సీలో రోగిని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ నారాయణ

భామిని: ఆస్పత్రికి వచ్చే వారి రోగం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కచ్చితత్వంతో నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఐఓ ఎం.నారాయణ అన్నారు. మండలంలోని బత్తిలి, భామిని పీహెచ్‌సీలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు సంబంధించి రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డు లు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. సీబీసీ ఎనలైజర్ ద్వారా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినట్లు గుర్తిస్తే వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుపుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే రోగులతో మాట్లాడారు. అనంతరం భామిని కేజీబీవీని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశా రు. బత్తిలి, భామిని వైద్యాధికారులు దామోదరరా వు, సంతోషిలక్ష్మి, ఎస్ఓలు జయగౌడ్, సరస్వతి, గౌరీశ్వరి, ఎస్ఓ శారదలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. పాలకొండ పట్టణంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా మహ సభలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకపాలన సాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసగించిందని వివరించారు. ఇటువంటి ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బా రవణమ్మ మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు ఐకమత్యంతో పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం తప్పదని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావా ల రమణారావు, జిల్లా కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బ్యాగ్ లేకుండా బడికి.. భలే భలే

- ప్రతీ నెల మొదటి, మూడో శనివారం 'నో బ్యాగ్‌డే'
- విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యం
- ఆటలు, పాటలతో విద్యాబోధన

బలిజిపేట: ఎస్‌సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్) ఆదేశాలతో సర్కార్ బడులలో నెలలో మొదటి, మూడవ శనివారాలు 'నో బ్యాగ్‌డే' (సృజన శనివారం సందడి) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 2019 సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులు చదువు వల్ల ఒత్తిడికి గురికాకుండా చూడటం, వారిలో మానసిక ఉల్లాసాన్ని రేకెత్తించడం, వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు తగిన వాతావరణాన్ని కల్పించమే ఈ 'నో బ్యాగ్‌డే' కార్యక్రమం ఉద్దేశం. బ్యాగుల భారాన్ని ఒక్క రోజైనా తగ్గించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల బలిజిపేట మండలంలో 44ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు 2,496మంది విద్యార్థులు ఒత్తిడి లేకుండా విద్యనభ్యసిస్తున్నారు.

1,2 తరగతులకు ఇలా..

'సృజన సందడి'లో భాగంగా 1,2వ తరగతుల పిల్లలకు 'పాడుకుందాం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో పాటాలు, గేయాలు, జానపదాలు, నీతి పద్యాలను పాడించడం, 'మాట్లాడుకుందాం'లో భాగంగా కథలు, ఫజిల్స్, సరదా ఆటలను ఆడించడం, 'నటిద్దాం'లో భాగంగా నాటికలు, ఏకపాత్రాభినయం, నృత్యం, అభినయం, డైలాగులు పలికించడం వంటివి చేయిస్తారు. సృజనలో భాగంగా డ్రాయింగ్, మట్టిబొమ్మల తయారీ, మాస్కులు, అలంకార వస్తువులను చేయడం నేర్పిస్తారు.

3,4,5 తరగతులకు ఇలా..

3,4,5 తరగతుల పిల్లలకు 'తోటకు పోదాం'లో భాగంగా బడి ఆవరణలో మొక్కలు నాటడం, కలుపుతీత, పందిర్లు వేయడం వంటివి చేయిస్తారు. బడిలో పరిసరాలను శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి. 'విందాం' కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలోని హెల్త్ వర్కర్, పంచాయతీ సెక్రటరీ, రైతులు, వ్యాపారులను బడికి పిలిపించి వారితో మాట్లాడించడం వంటివి చేయించాలి. నోబ్యాగ్ డే ప్రణాళిక.. రోజులో భాషకు సంబంధించి 90 నిమిషాలు, ప్రదర్శనకు 90, క్రియేటివిటీకి 90, ఆటలకు సమయం 90 నిమిషాలు చొప్పున కేటాయింపు చేయాలి.



అరసాడ(హెచ్) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత చేయించిన కృత్యాలు



వెంగళరాయపురంలో వీడియో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

యశ్‌పాల్ కమిటీ సూచనల ఆధారంగా..

పుస్తకాల భారం విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై యశ్‌పాల్ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. గుణాత్మక విద్య అందించాలని సూచించింది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 3 కిలోలలకు మించి పుస్తకాల బరువు ఉండకూడదని, పదో తరగతి విద్యార్థులకు 5 కిలోల వరకే బరువు ఉండాలని సూచించింది.

సృజనాత్మకతకు పదును



'నో బ్యాగ్‌డే' అమలు సత్ఫలితాలు ఇస్తోంది. పుస్తకాలకే పరిమితమైన విద్యార్థుల చేత పాటలు పాడించడం, ఆటలు ఆడించడం, మొక్కల పెంపకం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు, అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది.

– సామల సింహాచలం, ఎంఈఓ–1, బలిజిపేట

వందశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా బోధన



మాట్లాడుతున్న పాఠశాల ప్రత్యేకాధికారి అవినాష్

సీతానగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని గాదెలవలస ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారి, మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. గాదెలవలస పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. హెచ్‌ఎం శంకరరావు అధ్యక్షతన ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల్లో పలువురు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదే విధంగా 2024–25 విద్యాసంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మరింత మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన, క్రీడా మైదానాన్ని పరిశీలించారు.

జూనియర్ కళాశాలల్లో ఎండీఎం పథకం అమలు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్



మాట్లాడుతున్న బి.రవికుమార్

పార్వతీపురం టౌన్: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు పూర్తయిందని, కానీ ఇంతవరకు పథకం అమలు చేయలేదని అన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. లేనిచో భవిష్యత్తులో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక డీఎస్సీ ద్వారానే గిరిజనులకు న్యాయం



ఆదివాసీ జేఏసీ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: ప్రత్యేక డీఎస్సీ ద్వారానే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ నిమ్మక జయరాజు, ఆదివాసీ జేఏసీ చైర్మన్ కొండగొర్రి ధర్మారావు కోరారు. స్థానిక గిరిజన భవనంలో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు అధ్యక్షతన జేఏసీ జిల్లా శాఖ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు అరకు, కురుపాం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఎస్టీలకు ప్రత్యేక ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు నవంబరులో విడుదల చేయనున్న డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌లో షెడ్యూల్ తెగలకు సంబంధించి పోస్టులను ప్రత్యేకంగా పేర్కొనాలని కోరారు. ఇటీవల పీసా గ్రామసభల ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికలు వాయిదా వేయడం వెనుక ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే పీసా ఎన్నికలు నిర్వహించి గిరిజనుల స్వయంపాలనకు సంబంధించి నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరలో అన్ని నియోజకవర్గాల ఎస్టీ శాసనసభ సభ్యులకు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులకు ఈ మేరకు వినతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే ప్రతీ నియోజకవర్గం పరిధిలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో విశ్రాంత ఎస్‌డీసీ ఆరిక ధర్మారావు, ఆదివాసీ నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, వాసు, ఇంటికుప్పల రామకృష్ణ, ఎ.అన్నాజీ, రోబా లోవరాజు, కె.రాఘవేంద్ర, నిమ్మక అన్నారావు, మండల గిరిధరరావు, మల్లయ్య, తాడంగి సత్యం, త్రినాథ, తిరుపతి, నరేష్, పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు అరసాడ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బలిజిపేట: మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం రమణ తెలిపారు. అండర్–17 విభాగంలో పి.ఐశ్వర్య, ఎం.నిఖిత, జి. లలిత, అండర్–14 విభాగంలో ఎం.కుమారస్వామి, ఆర్. కౌశిక్, జి.యమున, సీహెచ్.శ్రీదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా ఈ నెల 28 నుంచి 30 వరకు అనంతపురం జిల్లా లేపాక్షిలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ–1 సామల సింహాచలం, హెచ్‌ఎం రమణ, పీఈటీ గణపతి, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులలో నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ అన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

సీతానగరం: మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను పరిష్కరించుకునేందుకు రీసర్వే ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు అన్నారు. కాశీపేటలో భూముల రీసర్వేపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.చంద్రశేఖర్, జెడ్పీ మాజీ సభ్యులు టి.వెంకటప్పలనాయుడు, విశ్రాంత వీఆర్వో ప్రభాకరనాయుడు, మండల సర్వేయరు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

సాలూరు:



ఆర్టీసీ డీఎం భాస్కర్‌రెడ్డి

డయల్‌యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించిందని డీఎం భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, ఆర్టీసీ అభివృద్ధికి సూచనలు, సలహాలు స్వీకరణకు శనివారం ఉదయం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులు, ప్రజలు ఫోన్‌లో తమ సమస్యలను, ఫిర్యాదులను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బొబ్బిలి మీదుగా రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి, పర్లాకిమిడి బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు ప్రయాణికులు కోరినట్లు చెప్పారు. పట్టణంలో మామిడిపల్లి, పోస్టాఫీసు పాయింట్స్ వద్ద ట్రాఫిక్ గైడ్స్‌ను నియమించాలని, పంచక్షేత్ర శివాలయాలకు సాలూరు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని పలువురు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రతే ఆర్టీసీ ప్రథమ ప్రాధాన్యత అని, వారి ఫిర్యాదులు, సూచనలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



రామవరం సమీపంలో విద్యుత్ స్తంభాల మార్పిడిని పరిశీలిస్తున్న ఏఈ జగన్మోహనరావు

సీతానగరం: మండలంలో విద్యుత్ కోతల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహనరావు అన్నారు. రామవరం, రెడ్డివానివలస రహదారిలో శిథిలమైన విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారంతో పాటు వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ పి.సత్యంనాయుడు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

ధరలు బోర్డులకే పరిమితం

- పెరిగిన నిత్యావసరాల ధరలు
- కూటమి ప్రభుత్వంలో సామాన్యునికి చుక్కలు
- రైతు బజారుల్లో సైతం అధికంగా వసూలు
- పట్టించుకోని అధికారులు

పార్వతీపురం టౌన్:

కూటమి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారంలోకి వస్తే నిత్యావసర ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ హామీని గాలికొదిలేసింది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్య ప్రజలు కొనలేని, తినలేని పరిస్థితి. ధరలు తగ్గిస్తామని, రైతు బజారుల్లో రాయితీపై అందిస్తామని ప్రభుత్వం చెపుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.



రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వ్యక్తి

రైతు బజారులో ధరల వివరాలు..

కూరగాయలు(కేజీల్లో)	ధర	కేబేజీ బుట్ట	రూ.26
టమాటా	రూ.50	కీరదోస	రూ.30
వంకాయలు	రూ.37	మునగకాడలు	రూ.90
బెండకాయలు	రూ.30	బంగాళదుంపలు	రూ.32
దొండకాయలు	రూ.34	ఉల్లి కర్నూలు రకం	రూ.28
బీరకాయలు	రూ.25	ఉల్లి మహారాష్ట్ర రకం	రూ.50
కాకరకాయలు	రూ.25	అల్లం	రూ.110
ఆనపకాయ	రూ.18	వెల్లుల్లి	రూ.320

పార్వతీపురం రైతు బజారులో బోర్డుపై ఉన్న ధరల కంటే విని యోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో ఎప్పుడున్నా ఇదే పరిస్థితి వస్తోందని మార్కెట్‌కు వచ్చేవారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీపురం రైతు బజారు

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నా రైతు బజారు అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కిలో టమాటా రూ.50లు అని ఉంటే రూ.20లు అదనంగా వేసుకుని రూ.70కి విక్రయిస్తున్నారు. ఒక్క టమాటానే కాదు రైతు బజారులో లభ్యమయ్యే అన్ని కూరగాయలను బోర్డులో నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకే అమ్మకాలు చేస్తున్నారు. సామాన్యులపై అధిక ధరల భారం పడకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కూరగాయలు, నిత్యావసర సరుకులు విక్రయించేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలు కూరగాయలు, నిత్యావసర సరుకులు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు చేపడతాం. అటువంటి దుకాణాలపై దృష్టి సారించాం. దసరా పండుగ ముందు రాయితీపై టమాటాను అందించాం. ప్రభుత్వ ఆదేశిస్తే మళ్లీ అమ్మకాలు చేపడతాం. అధిక ధరలకు విక్రయాలు చేపడితే తక్షణమే మా దృష్టికి తీసుకురావాలి. వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– సంజన, ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్ పార్వతీపురం

చెప్పేది ఒకటి చేసేది ఒకటి

కూటమి ప్రభుత్వంలో చెప్పేది ఒకటి చేసేది మరొకటి. కూరగాయల ధరల పట్టికలో ఓ విధంగా ధరలు ఉంటే అందుకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్ముతున్నారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే సరుకు లేదు, నచ్చితే తీసుకోండి లేకపోతే బయట తీసుకోండి అంటూ సమాధానం ఇస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– గులిపిల్లి వెంకటలక్ష్మి, పార్వతీపురం

ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే..

ధరలు తగ్గించామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. రెండు రోజులు మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మకాలు చేపట్టారు. ఆ మరుసటి రోజు నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అలాంటప్పుడు ఈ ధరల పట్టికను ప్రదర్శించడం దేనికి. అధికారులు తప్పనిసరిగా స్పందించి ధరల పట్టికలో నిర్ణయించిన ధరలకే కూరగాయలు అమ్మకాలు చేపట్టాలి.

– అరసాడ కాంచన, పార్వతీపురం